క్లుప్తంగా

జేసీతో సమావేశమైన ఎమ్మెల్యే పేర్ని నాని



చిలకలపూడి(మచిలీపట్నం): జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌తో మంగళవారం బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) సమావేశమయ్యారు. బందరు నియోజకవర్గానికి సంబంధించి పలు భూ సమస్యలపై ఆమెతో చర్చించారు. బందరు పోర్టు నిర్మాణానికి సంబంధించి రోడ్డు, రైల్వే కనెక్టివిటీ రహదారి నిర్మాణం కోసం ఇప్పటి వరకు చేపట్టిన భూ సేకరణ, ఇంకా సేకరించాల్సిన భూముల గురించి చర్చించారు. జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మాణం పురోగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణం చేపట్టేలా తనవంతు కృషి చేస్తానని అధికారులకు పేర్ని నాని హామీ ఇచ్చారు. ఆర్డీఓ ఐ. కిషోర్, తహసీల్దార్ డి. సునీల్‌బాబు పాల్గొన్నారు.

జామియా మసీదుకు రూ. 10 లక్షలు అందజేత



మచిలీపట్నంటౌన్: నగరంలోని జామియా మసీదులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) రూ. 10 లక్షల ఆర్థిక సాయాన్ని మంగళవారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదాతో కలిసి జామియా మసీదు అధ్యక్షుడు పాషా, కమిటీ సభ్యులకు అందజేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మొహమ్మద్ సాహెబ్, మొహమ్మద్ రఫీ, షేక్ రబ్బానీ, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై సమావేశం

పెడన: పట్టణంలోని 11వ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి పోలింగ్ కేంద్రం ఏర్పాటుపై మున్సిపల్ కమిషనర్ అంజయ్య రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం సమా వేశం నిర్వహించారు. అంజయ్య మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాన్ని జోగానందరావు కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేశామని చెప్పగా తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రాజకీయ పార్టీల నాయకులు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ సుందరం, టీపీఓ ఏసుబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు బండారు మల్లి, సీపీఎం నాయకుడు గోరు రాజు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సీహెచ్ అప్పారావు, బీజేపీ నాయకుడు పిచ్చుక శంకర్, జనసేన నాయకుడు జయకృష్ణ, టీడీపీ నాయకుడు శ్యామలయ్య పాల్గొన్నారు.

తొమ్మిది వేల మందికి అన్నసమారాధన

కోడూరు: విశ్వనాథపల్లి నాంచారమ్మ అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. దాతల విరాళాలు రూ.1.25 లక్షలతో అన్నసమారాధన నిర్వహించామని ఆలయ కమిటీ తెలిపింది. తొమ్మిది వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారని చెప్పారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, సర్పంచి కొప్పనాతి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

నవ ధాన్యాల సాగుపై అవగాహన

నాగాయలంక(అవనిగడ్డ): నాగాయలంక మండలం వక్కపట్లవారిపాలెంలో నవధాన్యాల సాగుపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌బీకే వద్ద నవ ధాన్యాల ప్రదర్శనను సర్పంచ్ శ్యాంప్రసాద్ ప్రారంభించారు. ఎంఏఓ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో జీవ వైవిధ్యం పెరుగుతుందన్నారు. 32 రకాల విత్తనాలను గుళికలుగా చేసి తొలకరి వర్షాలకు ముందు పొలంలో చల్లుకోవాలన్నారు. ఎంటీ వాణి మాట్లాడుతూ నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎస్‌డీఏ బి. రాంబాబు, వీఏఏ జ్యోతి, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మహంకాళమ్మ జాతర

గూడూరు: ముక్కొల్లులో కొలువుదీరిన మహంకాళమ్మ జాతర మంగళవారం రాత్రి ముగిసింది. జాతర రెండో రోజైన మంగళవారం ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. వాహనాలపై ప్రత్యేకంగా అలంకరించిన ప్రభలతో వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కుబడులు సమర్పించారు. జాతర సందర్భంగా తరలివచ్చిన బంధుగణంతో గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది. బందరు రూరల్ సీఐ పి.వీరయ్య గౌడ్ ఆధ్వర్యంలో గూడూరు పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు.

సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయండి

- ఖాళీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించండి
- కలెక్టర్ రంజిత్‌బాషా
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు సూచనలు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రీ–సర్వే పూర్తయిన గ్రామాల్లో ఎ, బి క్లాస్ సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్ నుంచి మంగళవారం సాయంత్రం మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తొలిదశలో రీ సర్వే పూర్తయిన గ్రామాలన్నింటిలో రాళ్లను ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే జిల్లాకు వచ్చాయని, వీటిని అమర్చాలన్నారు. రోవర్ ద్వారా పాయింట్లు గుర్తించి రాళ్లను ఉంచాలని చెప్పారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో దశల వారీగా ప్రక్రియను పూర్తి చేసి రికార్డుల స్వచ్ఛీకరణ, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, 13వ నోటిఫికేషన్ తదితర అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అనంతరం భూ యజమానులకు భూ హక్కు పంపిణీ కార్యక్రమం స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో నిర్వహించాలన్నారు.

లంక భూముల సర్వేలను పారదర్శకంగా చేపట్టి భూమి లేని నిరుపేదలకు, భూములు అనుభవిస్తున్న వారికి ఐదేళ్ల లీజు ప్రాతిపదికన అప్పగించాలని చెప్పారు. జిల్లాలో పలు కారణాలతో ఖాళీగా ఉన్న స్థానాలైన ఉయ్యూరు జెడ్పీటీసీ, తేలప్రోలు ఎంపీటీసీ, పెడన మునిసిపాలిటీలో 11వ వార్డు, జిల్లాలోని సర్పంచ్ స్థానాలకు ఎన్నికల నిమిత్తం ముసాయిదా జాబితాను ప్రకటించామన్నారు. అభ్యంతరాలు తెలియజేయాలని చెప్పారు. 9వ తేదీన పరిశీలన చేపట్టి 10వ తేదీన తుది జాబితాను ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా షెడ్యూల్ విడుదల చేశారని వివరించారు. జేసీ అపరాజితసింగ్, డీఆర్వో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ జి.శ్రీనివాసరావు, డీపీఓ కె.నాగేశ్వర నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సత్యనారాయణరాజు, డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కె.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి. రంజిత్‌బాషా అన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముద్రించిన వాల్‌పోస్టర్లను కలెక్టర్ మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో గీతాబాయి, ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

కడవకొల్లుకు పలువురి అభినందన

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ కృష్ణా, ఎన్‌టీఆర్, గుంటూరు జిల్లాల రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన కడవకొల్లు నరసింహారావును పలువురు అభినందించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కడవకొల్లుకు శాలువాకప్పి పూలమాలవేసి అభినందించారు. కడవకొల్లు మాట్లాడుతూ మూడు జిల్లాలో రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని కడవకొల్లు నరసింహారావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, జిల్లా సంయుక్త కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, నందిగం అభిషేకరావు, కోసూరు ప్రసాద్, మోపిదేవి పసి తదితరులు కడవకొల్లును సన్మానించారు.

బసవయ్యకు సన్మానం



కడవకొల్లును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన లింగారెడ్డిపాలెం మాజీ సర్పంచ్ గుర్రం బసవయ్యను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సన్మానించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బసవయ్యను ఎమ్మెల్యే సింహాద్రి, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు పూలమాల వేసి అభినందించారు.

వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, విక్రయాలు పెరగాలి

డీఎల్‌పీఓ జ్యోతిర్మయి

చల్లపల్లి: గ్రామ పంచాయతీల్లోని సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్ట్ ఉత్పత్తి, విక్రయాలు పెరగాలని బందరు డీఎల్‌పీఓ ఐ.జ్యోతిర్మయి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మోడల్ డంపింగ్ యార్డులో ఘన వ్యర్థాల నుంచి సంపద తయారీపై ఏర్పాటుచేసిన శిక్షణ తరగతులను డీఎల్‌పీఓ జ్యోతిర్మయి, ఎంపీపీ కోట విజయరాధిక, జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి ప్రారంభించారు. ఐదు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో బందరు డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తారు. చల్లపల్లి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది, క్లాప్ మిత్రలు గ్రామంలో ఇళ్ల నుంచి తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, తడి చెత్త, పేడ డంపింగ్ యార్డుకు చేర్చి నాడెప్ పిట్లలో వేయడం చేసి చూపించారు. వర్మీ కంపోస్టు ఉత్పత్తి, స్వచ్ఛ భారత్ నిధులతో మంజూరైన పరికరాలు వినియోగిస్తున్న విధానాన్ని వివరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, బంటుమిల్లి ఎంపీడీఓ జె.స్వర్ణభారతి, చల్లపల్లి ఇన్‌చార్జి ఎంపీడీఓ అరుణ కుమారి, ఈఓపీఆర్డీలు గుత్తికొండ కిషోర్, బూరేపల్లి అశోక్, పంచాయతీ ఈఓ పడమట సుకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు సీఎం జగన్ ప్రాధాన్యం

డెప్యూటీ మేయర్ కవిత

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని డెప్యూటీ మేయర్ తంటిపూడి కవిత అన్నారు. నోబుల్ కళాశాల స్త్రీ సాధికారత విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. కవిత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే తనకు డెప్యూటీ మేయర్ పదవి వచ్చిందన్నారు. వైఎస్సార్ సీపీ నగర నాయకుడు బందెల థామస్ నోబుల్, కళాశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్ మాట్లాడారు. కళాశాల స్త్రీ సాధికారత విభా గం కో–ఆర్డినేటర్ మంజులా శ్రీవేణి, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ శాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత థామస్ నోబుల్ దంపతులను సన్మానించారు.

- బందరు మండల ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. 300 మంది మహిళలు పాల్గొని ఆటపాటలతో కేరింతలు కొట్టారు. పలు పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

పోస్టల్ సిబ్బందికి నేత్ర వైద్య పరీక్షలు

అవనిగడ్డ: పోస్టల్ రిక్రియేషన్ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక హెడ్ పోస్టాఫీస్‌లో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. పోస్టల్ సూపరింటెండెంట్ వి. యలమందయ్య శిబిరాన్ని ప్రారంభించారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు, మోపిదేవి మండలాలకు చెందిన పోస్టల్ సిబ్బందికి డాక్టర్ శివరామకృష్ణ నేత్ర పరీక్షలు చేశారు. హెడ్‌పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శేషగిరిరావు పర్యవేక్షించారు.

50 మందికి నేత్ర వైద్య పరీక్షలు

గూడూరు: విజయవాడకు చెందిన రావెళ్ల కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గూడూరులో పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సర్పంచి లింగం సులోచనారాణి శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన 50 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 10 మందికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్‌రంగబాబు, పీఏసీఎస్ చైర్మన్ తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

దంపతులపై చీటింగ్ కేసు

పెడన: విజయవాడకు చెందిన భార్యాభర్తలపై పెడన పోలీస్ స్టేషన్‌లో మంగళవారం చీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక 15వ వార్డుకు చెందిన దొండపాటి చక్రధర్ గత ఏడాది నవంబర్‌లో మృతిచెందాడు. చక్రధర్ అనారోగ్యంతో సుమారు మూడేళ్ల పాటు హైదరాబాద్‌లో చికిత్స పొందాడు. చక్రధర్ పేరుతో ఉన్న జీవిత బీమా పాలసీలు, బ్యాంకు ఖాతాలను అతని చెల్లెలు తిక్కా రుక్మిణి, ఈమె భర్త బాబూ వెంకట సత్యకుమార్‌లు నామినీలుగా తనను మోసం చేసి రాయించుకున్నారని చక్రధర్ భార్య శివకాంచన దుర్గ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మొత్తం సుమారు రూ.70 లక్షల వరకు ఉంటుందని, విజయవాడలో ఉంటున్న రుక్మిణి, సత్యకుమార్‌లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. ఎస్‌ఐ వి. రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

బంగారు ఆభరణాల చోరీపై కేసు నమోదు

పెడన: వివాహానికి హాజరయ్యేందుకు మెట్టినింటి నుంచి పుట్టింటికి వచ్చిన ఒక మహిళ బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరుకు చెందిన మామిడి రోజా పెడన బ్రహ్మపురంలోని తన పుట్టింటికి ఫిబ్రవరి 23న వచ్చింది. మరుసటిరోజు ఉదయం పెళ్లికి వెళ్లేందుకు నగలు వేసుకుందామని బ్యాగు తెరవగా అందులో ఉండాల్సిన 22 కాసుల నగలు కనిపించలేదు. ఏలూరులోని ఇంటి వద్ద ఏమైనా మరిచిపోయానా అనే అనుమానంతో తిరిగి ఏలూరులో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీనిపై మంగళవారం పెడన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ రవిచంద్రకుమార్ కేసు నమోదు చేశారు.

పోటెత్తిన భక్తులు



ఆలయం వద్ద భక్తుల కోలాహలం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

విశ్వనాథపల్లి గ్రామంలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ప్రధాన జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తులు కూడా విశ్వనాథపల్లికి చేరడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నాంచారమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

– కోడూరు

175 స్థానాలు గెలిచేలా పనిచేస్తాం

పేర్ని కిట్టు

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మేరకు తామంతా 175 నియోజకవర్గాలు గెలిపించే దిశగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో పేర్ని కిట్టును మంగళవారం సాయంత్రం ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు చైతన్య, ఎన్టీఆర్ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బాబ్జి, ఈస్ట్ వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె కల్యాణ్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.3.39 లక్షల జరిమానా

కోడూరు: కోడూరు మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఉయ్యూరు విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరు, చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది 27 బృందాలుగా విడిపోయి విద్యుత్ మీటర్లు తనిఖీ చేశారు. సిబ్బంది 1,449 గృహ సర్వీసులను, 124 వాణిజ్య సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 128 సర్వీసులు అదనపు లోడు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వీరికి రూ.3.39 లక్షల జరిమానా విధించారు. ఉయ్యూరు విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడడం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లు తెలిస్తే సెల్: 94408 12362, 94408 12363, 83310 14851 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యుత్ ఈఈ సీహెచ్ రాంభొట్లు, అవనిగడ్డ, చల్లపల్లి డీఈలు ఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఏఈ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్బీ సీఐ రమణ బాధ్యతల స్వీకారం

కోనేరుసెంటర్: కృష్ణా జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐగా జీవీ రమణ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ పి. జాషువా, అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకట రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

వృద్ధులకు అన్నదానం

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వాసవీ క్లబ్, వాసవీ వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రాజుపేటలోని ఆనంద వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. వాసవీక్లబ్ కార్యదర్శి పవన్‌కుమార్, కోశాధికారి దీపు ప్రసాద్, వనిత క్లబ్ జోన్ చైర్మన్ శిరీష, డీపీఓలు శ్రీకాకోళపు రేణుకారాణి, రంగనాయకులు పాల్గొన్నారు.

నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు: గూడూరులోని రాజ్యలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాలు మూడో రోజుకు చేరాయి. దీనిలో భాగంగా మంగళవారం స్వామి వారి కోలలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి రథోత్సవం కనులపండువగా సాగింది. స్వామి వారిని వీధుల్లో ఊరేగించారు. తమ వీధుల్లోకి వచ్చిన స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

మచిలీపట్నంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కార్యాలయంలో మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, షటిల్ బాడ్మింటన్ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీలక్ష్మి, ఐసీడీఎస్ అధికారులు పర్యవేక్షించారు.

తైక్వాండోలో సత్తా చాటిన చల్లపల్లి బాలలు

చల్లపల్లి: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో గ్రామానికి చెందిన బాలలు సత్తా చాటారు. విజయవాడ లయోలా కళాశాలలో ఈ నెల 5వ తేదీన జరిగిన పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో ఎ.మహిత, ఎ.పునీత్ సాయి, ఎ.కౌశిక్ స్వర్ణ పతకాలు సాధించారు. క్యాడెట్ వెయిట్ విభాగంలో కె.తేజశ్రీ స్వర్ణ పతకం, కె.కార్తికేయ, ఎల్.శివ బాలాజీ, ఎ.హేమరాజు రజత పతకాలు సాధించారు. విశాఖపట్నంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు రాకేష్, మహిత, పునీత్ సాయి, కౌషిక్, తేజశ్రీ ఎంపికయ్యారని కోచ్ కందుల పవన్ తెలిపారు.

అలరించిన గానామృతం

మచిలీపట్నంటౌన్: గొడుగుపేట వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయ ప్రాంగణంలో జరిగిన శ్రీనివాస కల్యాణ గానామృతం భక్తులను ఆకట్టుకుంది. ఓలేటి గీతాపరమేశ్వరరావు బృందం ఆలపించిన భక్తిగీతాలు భక్తులను భక్తి పారవశ్యంలో ఓలలాడించాయి. ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

వైభవంగా శ్రీలక్ష్మీ జయంతి వేడుకలు

అవనిగడ్డ: ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక గీతా మందిరంలో శ్రీలక్ష్మీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, సువర్ణ పుష్పాలతో అష్టోత్తర హోమ కుండాలతో శ్రీలక్ష్మీ సుదర్శన నరసింహ హోమం జరిగాయి. ఎస్‌వీఎల్ క్రాంతి విద్యా సంస్థల చైర్మన్ దుట్టా ఉమామహేశ్వరరావు, న్యాయవాది సనకా రఘురామ ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు దీవి నరసింహ మూర్తి, ఆగమ పండితుడు దీవి సాయిఫణీంద్ర పూజా కార్యక్రమాలు నిర్వహించగా ఆలయ కమిటీ చైర్మన్ యర్రంశెట్టి హరిబాబు పర్యవేక్షించారు.

జగన్ పాలనలో అంతా మంచే జరిగింది

- పెదకళ్లేపల్లి వాసుల ఆనందం
- ఉత్సాహంగా గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలు లక్ష్మితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అంతా మంచే జరిగిందని, మళ్లీ మళ్లీ ఆయనే సీఎం కావాలని గ్రామస్తులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పెదకళ్లేపల్లి సచివాలయం–1లో మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే గడప గడపకు వెళ్లి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్ అందుకుంటున్న వృద్ధ మహిళ అరజా లక్ష్మీ మాట్లాడుతూ గతంలో పింఛన్ పొందేందుకు ఎన్నో ఇబ్బందులు పడేవారమని, జగనన్న ప్రభుత్వంలో ఇంటికే వచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నారని, ఆయన ప్రభుత్వమే మళ్లీ మళ్లీ రావాలని ఆశీర్వదించారు. విద్యాదీవెన, అమ్మ ఒడి, కాపు నేస్తం, రైతు భరోసా వంటి పథకాలతో తమను ఆదుకుంటున్నారని పలువురు ఎమ్మెల్యే సింహాద్రి వద్ద ఆనందం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సీఎం పాలనలో ప్రజలంతా సుఖంగా ఉన్నారని, విశాఖలో సమ్మిట్ వల్ల రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడులతో మన రాష్ట్రానికి వ్యాపారులు వస్తున్నందున యువకులకు ఉపాధి అవకాశాలు బాగా ఉంటాయని వివరించారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, గ్రామ కన్వీనర్ గండు దుర్గారావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అరజా లక్ష్మీతులసీ, మాజీ సర్పంచ్ అరజా వెంకట సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

గేదెల బీమా అందేలా చర్యలు

మచిలీపట్నంటౌన్: బందరు కోటలోని గేదెల పెంపకందారులకు నష్టం కలుగకుండా చనిపోయిన గేదెలకు ఇన్సూరెన్స్ అందేలా చర్యలు తీసుకుంటానని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 21వ డివిజన్ బందరుకోటలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు గేదెల ఇన్సూరెన్స్ గత రెండేళ్లుగా నిలిచిపోయిందని, దీంతో నష్టపోతున్నామని కిట్టు దృష్టికి తీసుకువచ్చారు. తాను వయసు మీదపడి కాళ్లు పనిచేయక మంచానే ఉంటున్నానని, దివ్యాంగ పింఛను ఇప్పించాలని వృద్ధుడు వేమూరి వెంకటరమణ పేర్ని కిట్టును కోరారు. సదరం ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసి మంజూరైన తరువాత పింఛను ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ మన్నే శారద, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ మన్నే శేషారావు, కార్పొరేటర్లు ఐనం తాతారావు, మాచవరపు రాంప్రసాద్, నాయకులు గాజుల భగవాన్, పురంశెట్టి శ్రీనివాసరావు, సుంకర రాఘవరావు పాల్గొన్నారు.

టీడీపీ మాజీ కౌన్సిలర్ ఇంట్లో నవరత్నాలు

మచిలీపట్నంటౌన్: 21వ డివిజన్ బందరుకోటలో టీడీపీ మాజీ కౌన్సిలర్ బచ్చుల అనిల్ కుటుంబానికి నవరత్న పథకాలు అందుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అనిల్ తల్లి గంగామహాలక్ష్మికి పింఛను కానుక ద్వారా రూ. 82 వేల లబ్ధి చేకూరిన బుక్‌లెట్‌ను మంగళవారం అందజేశారు. అలాగే అనిల్ భార్య కల్పనకు జగనన్న అమ్మఒడి ద్వారా రూ. 29 వేలు, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా 23,242 మొత్తం రూ. 52,242 అందాయని పేర్ని కిట్టు వివరించారు. దీనికి సంబంధించిన బుక్‌లెట్‌ను ఆమెకు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో అద్దంకి నాంచారమ్మ జాతర

పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని మంగళవారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ పాలకవర్గ చైర్మన్ ఆకుల వెంకట్రామయ్య, కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు స్వాగతం పలికారు. ఆలయ కమిటీ, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించారు. గత 15 రోజులుగా ఇంటింటా దర్శనం ఇస్తున్న అమ్మవారు మంగళవారం గుడికి చేరడంతో ఉత్సవాలు ముగిశాయి. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఊయల వేసి పిల్లలను అందులో పరుండబెట్టి ఊగించారు. పశువులు, గొర్రెలు, మేకలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అమ్మవారి జాతర సందర్భంగా ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి, భరతనాట్యం, బాలనాగమ్మ, సత్య హరిశ్చంద్ర నాటకం, హైదరాబాద్ సినీ గాయని మోహన భోగరాజు శ్రీ లలిత టీమ్ ఆర్కెస్ట్రా, వరంగల్ వారిచే మహిళల దాండియా, మహిళల కోలాటం, వరంగల్ వారిచే తీన్‌మార్ వాయిద్యాలు, మిమిక్రీ షో, మ్యాజిక్ షో, మురళీ కోలాటం వంటి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కల్యాణం.. కమనీయం

యార్లగడ్డ (చల్లపల్లి): గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. దేవదాయ శాఖ సహాయ కమిషనర్, చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల ఈఓ ఎస్.సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్వామివారి కల్యాణం జరిపించారు. ఆలయ అర్చకులు రామగోపాల్, యాజ్ఞిక బ్రహ్మ అగ్నిహోత్రం భాస్కరాచార్యులుచే స్వామి వారి శాంతి కల్యాణం జరిపించారు. సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ, జూనియర్ అసిస్టెంట్ కె.రమావాణి, సిబ్బంది పాల్గొన్నారు.

సేవకులకు సన్మానం

పెడన: పట్టణంలోని అమ్మ ఫుడ్ ఫౌండేషన్ ద్వారా ఆరేళ్లుగా దాతల సాయంతో పేదలకు అన్నదానం చేస్తున్న అమ్మ ఫుడ్ ఫౌండేషన్ నిర్వాహకులు ఎర్ర మల్లికార్జునరావు, చౌడేశ్వరి దంపతులను ఆర్య వైశ్య పట్టణ వాసవి మహిళా మండలి సంఘం ఘనంగా సన్మానించి నూతన వస్త్రాలు బహూకరించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వాసవి క్షేత్రంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లో దంపతులకు సేవలందిస్తున్న జక్కుల లక్ష్మీ, వార్త మాధవిలతో పాటు మరో 30 మంది వృద్ధులు, మహిళలను సన్మానించి చీరలు అందజేశారు.